క్లుప్తంగా

నిందితులను కఠినంగా శిక్షించాలి

ఆరిలోవ: కోల్‌కతాలో జూనియర్ వైద్యురాలిని హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని ఆరిలోవ కేంద్రంగా ఉన్న నాస్తిక సమాజం కేంద్ర కమిటీ నాయకులు జె.రవి, టి.శ్రీరామమూర్తి ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఆమెపై లైంగికదాడి చేసి అనంతరం హత్య చేసినట్లు పోస్టుమార్టం రిపోర్టులో వెల్లడైనప్పటికీ నిందితులపై చర్యలు చేపట్టలేదని తెలిపారు. దీనిపై ఎవరో పెద్దల హస్తం ఉందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయని ఆరోపించారు. దీనిపై సుప్రీం కోర్టు న్యాయమూర్తితో విచారణ జరిపించాలని విజ్ఞప్తి చేశారు. దేశంలో వైద్యులకు రక్షణ కల్పించాలని, సెంట్రల్ ప్రొటెక్షన్ యాక్ట్ అమలు చేయాలని, హింసను ప్రేరేపించే మద్యం, మత్తు పదార్థాలను నిషేధించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఎమ్మెల్సీ బొత్సకు అభినందన



బొత్స సత్యనారాయణకు పుష్పగుచ్ఛం అందిస్తున్న మధుసూదన్‌రెడ్డి

బీచ్‌రోడ్డు: స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా ఏకగ్రీవంగా ఎన్నికైన మాజీ మంత్రి బొత్స సత్యనారాయణకు వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సేవాదళ్ అధ్యక్షుడు పిలక మధుసూదన్ రెడ్డి అభినందనలు తెలిపారు. సిరిపురంలోని బొత్స నివాసంలో ఆదివారం ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు.

తీరంలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

కొమ్మాది: భీమిలి బీచ్ రోడ్డు తిమ్మాపురం తీరం వద్ద ఆదివారం ఉదయం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం కొట్టుకువచ్చింది. దాసరి రఘురాం అనే వ్యక్తి వాకింగ్ చేస్తుండగా ఈ ప్రాంతంలో తీరం వద్ద నల్ల ప్యాంట్, ఎరుపు, నలుపు గల టీ షర్టుతో (సుమారు 35 నుండి 40 సంవత్సరాలు) వ్యక్తి మృత దేహం కనిపించింది. వెంటనే ఆయన భీమిలి పోలీసులకు ఫిర్యాదు చేయగా, సీఐ డి.రమేష్ సంఘటనా స్థలం చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భీమిలి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

నేడు తిరుమంజన హోమం

కొమ్మాది: భీమిలి బీచ్ రోడ్డు వారిజ ఆశ్రమంలోని హయగ్రీవ మందిరంలో శ్రావణ పూర్ణిమ శ్రీ లక్ష్మీ హయగ్రీవ జయంతి సందర్భంగా సోమవారం తిరుమంజనం (అభిషేకం) హోమం, కవచ అలంకరణ, ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆశ్రమ నిర్వాహకులు శ్రీకాంతాచార్యులు తెలిపారు. కార్యక్రమం ఉదయం 7.30 గంటలకు ప్రారంభం కానున్నట్లు పేర్కొన్నారు.



వ్యాధులపై ఇంటింటి సర్వే



వాటర్ ట్యాంకులో ఆయిల్ బాల్స్ వదులుతున్న సిబ్బంది



సెప్టిక్ ట్యాంక్ పైప్‌కు మెస్ ఏర్పాటు చేస్తున్న జీవీఎంసీ జోన్-3 సిబ్బంది

వ్యాధుల కట్టడిపై జీవీఎంసీ గురి

- జోన్–3 యంత్రాంగం విస్తృత కసరత్తు
- ముందస్తు చర్యలు, అవగాహన శిబిరాలు
- ప్రజా అప్రమత్తతపై ప్రత్యేక శ్రద్ధ



రక్త పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

ఎంవీపీకాలనీ: జీవీఎంసీ ఆరోగ్య శాఖ విభాగం సీజనల్ వ్యాధుల నివారణకు విస్తృత చర్యలు చేపట్టింది. జీవీఎంసీ కమిషనర్ ఆదేశాలతో జోన్-3 ఆరోగ్య, మలేరియా విభాగం ఉద్యోగులు అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారు. సీజనల్ వ్యాధులపై ఇంటింటి ప్రచారంతోపాటు అవగాహన కార్యక్రమాలు, సర్వేలు విస్తృతం చేశారు. వ్యాధులను ముందుగానే గుర్తించేందుకు సామూహిక రక్త పరీక్షలు నిర్వహిస్తున్నారు. అనారోగ్యం, బలహీనత, జ్వరం వంటి లక్షణాలు బయటపడితే తక్షణమే ఆశా వర్కర్లను అప్రమత్తం చేసి వైద్యం అందిస్తున్నారు. అసరమైన వారిని ఆస్పత్రులకు పంపిస్తున్నారు.

3 డెంగ్యూ కేసుల నమోదు

జోన్-3 పరిధిలో గత రెండు నెలల్లో 3 డెంగ్యూ కేసులను గుర్తించారు. 19వ వార్డు జాలరిపేటలో ఒకటి, 17వ వార్డు ఉషోదయలో ఒకటి, 27వ వార్డు దొండపర్తిలో మరో డెంగ్యూ కేసు నమోదైనట్లు జోన్-3 హెల్త్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయం వెల్లడించింది. జోన్-3 పరిధిలోని అన్ని వార్డులు, ప్రాంతాల్లో సీజనల్ వ్యాధులపై పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపింది. జోన్-3 పరిధిలోని పెద జాలరిపేట, సీతంపేట, దొండపర్తి ప్రాంతాలను హైరిస్క్ ప్రాంతాలుగా గుర్తించారు. ఆ ఏరియాల్లో వ్యాధుల నివారణకు ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆరోగ్య శాఖ సిబ్బంది, ఏఎన్‌ఎంలు, స్థానిక హెల్త్ సెక్రటరీలు సంయుక్తంగా అవగాహన ర్యాలీలు, శిబిరాలు నిర్వహిస్తున్నారు. నిల్వ నీటిని నివారించడం, ఇంటి ఆవరణాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవడం వంటి అంశాలపై స్థానికులకు అవగాహనతోపాటు మురికివాడల్లో పర్యటించి ప్రయోగాత్మకంగా వివరిస్తున్నారు.

సామూహిక రక్త పరీక్షలు

గత జనవరి నుంచి ఇప్పటి వరకు 29 డెంగ్యూ, మలేరియా కేసులు నమోదయ్యాయి. సీజనల్ వ్యాధులు ప్రబలే సమయానికి కేసుల సంఖ్యను యంత్రాంగం ఘననీయంగా తగ్గించింది. దీనికి కారణం రెండు నెలలుగా 3 డెంగ్యూ కేసులు మాత్రమే నమోదు కావడం. మలేరియా, డెంగ్యూ, డయేరియా కేసుల నివారణే లక్ష్యంగా జీవీఎంసీ జోన్-3 యంత్రాంగం విస్తృతంగా సేవలందిస్తోంది. వ్యాధులను ముందే గుర్తించడం, వ్యాధిగ్రస్తులను అప్రమత్తం చేసి చికిత్స అందించడం వంటి చర్యలు చేపట్టింది. ఇందు కోసం హైరిస్క్ ప్రాంతాల్లో ముందస్తుగా సామూహిక రక్త పరీక్షలు విస్తృతంగా నిర్వహిస్తున్నారు. ఆశా వర్కర్లు, ఏఎన్‌ఎంలు అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారు. ఇంటింటి అవగాహన, నిల్వ నీటి ట్యాంకులు, పాత బోట్లు, లిఫ్ట్ గోతులు ఇలా చాలా చోట్ల ఆయిల్ బాల్స్ విడుదల, స్కూళ్లు, ఆస్పత్రుల్లో గోడలపై ఏసీఎం రసాయాన్ని పిచికారీ చేయడం వంటి ప్రణాళికలను పక్కాగా అమలు చేస్తున్నారు.



మురుగునీటి ప్రాంతాల్లో ఏసీఎం పిచికారీ

దోమల నిర్మూలనకు చర్యలు

దోమల నివారణే లక్ష్యంగా ఇప్పటికే జోన్-3 యంత్రాంగం విస్తృత ప్రణాళికలు అమలు చేస్తోంది. వారం రోజులుగా ప్రతి ఇంటికీ వెళ్లి వెంట్(సెప్టిక్‌ట్యాంక్) పైపులకు మెస్‌లు ఏర్పాటు చేసే ప్రక్రియను ప్రారంభించాం. సెప్టిక్ ట్యాంకుల ద్వారా దోమల వృద్ధిని అడ్డుకోవడమే మెస్‌ల ఏర్పాటు ప్రధాన లక్ష్యం. ప్రతి ఇంటికి రూ.30 జీవీఎంసీ ఖర్చు చేస్తోంది. ఇప్పటికే జోన్-3 పరిధిలో 100 ఇళ్లకు మెస్‌లు ఏర్పాటు చేశాం. త్వరలోనే నియోజకవర్గం మొత్తం ఈ ప్రక్రియ పూర్తి చేస్తాం.

– బి.శ్రీనివాస్, మలేరియా విభాగం ఇన్‌స్పెక్టర్, జీవీఎంసీ జోన్-3

భలే గిరాఖీ

ఆరిలోవ: ఆరిలోవలో ఆదివారం రాఖీ సందడి నెలకొంది. సోమవారం రాఖీ పండగ కావడంతో మహిళలు వారి అన్నదమ్ములకు రాఖీ కట్టడానికి సన్నద్ధమయ్యారు. షాపుల్లో రాఖీల విక్రయాలు పెరిగాయి. వ్యాపారులు షాపుల వద్ద, తోపుడు బళ్లపై వీధుల్లో విక్రయాలు జోరుగా జరిగాయి. వాటిని కొనడానికి అక్కచెల్లెమ్మలు ఆసక్తి చూపారు. టి.ఐ.సి.పాయింట్, బాలాజీనగర్, అంబేడ్కర్ కూడలి, తోటగరువు, రవీంద్రనగర్, ఆదర్శనగర్, విశాలాక్షినగర్ తదితర ప్రాంతాల్లో ఆకర్షణీయమైన రకరకాల రాఖీలు విక్రయిస్తున్నారు. వాటి సైజు, మోడల్‌ను బట్టి రూ.20 నుంచి రూ.200 దాటి విక్రయించారు. కొందరు వెండి రాఖీలు కొనడానికి ఆసక్తి కనబరిచారు. స్వీట్ దుకాణాలు సైతం కళకళలాడాయి. రాఖీ కట్టి నోరు తీపి చేయడానికి మహిళలు స్వీటు షాపులకు వెళ్లడంతో ప్రతి ప్రాంతంలో సందడి నెలకొంది.



ఆరిలోవలో తోపుడు బండిపై విక్రయిస్తున్న వివిధర రకాల రాఖీలు

జూలో రెడ్ నెక్డ్ వాల్లబీ సందడి

ఆరిలోవ: ఇందిరాగాంధీ జూ పార్కు ఆదివారం సందర్శకులతో కళకళలాడింది. వన్యప్రాణులు ఎన్‌క్లోజర్లలో హుషారుగా తిరుగుతూ కనువిందు చేశాయి. ఇక్కడ రెడ్ నెక్డ్ వాల్లబీ ఎన్‌క్లోజర్‌లో గెంతులు వేస్తూ.. అటూ ఇటూ పరిగెడుతూ సందర్శకులను మరింతగా ఆకట్టుకుంది. ఇటీవల గుజరాత్ జూ నుంచి ఒక జత రెడ్ నెక్డ్ వాల్లబీని జూ అధికారులు ఇక్కడికి తీసుకొచ్చిన విషయం తెలిసిందే. వాటి కోసం ప్రత్యేకంగా ఎన్‌క్లోజర్‌ను సిద్ధం చేశారు. దానిలో ఆదివారం యానిమల్ కీపర్ ఆహారం(పచ్చని ఆకులు) అందించే సమయంలో వాల్లబీలు పరుగులు తీశాయి. యానిమల్ కీపర్‌కు దూరంగా ఎన్‌క్లోజర్ లోపల అమర్చిన దుంగల మీదుగా ఎగురుతూ పరిగెడుతూ సందడి చేశాయి.



యానిమల్ కీపర్‌కు దూరంగా పరిగెడుతున్న రెడ్ నెక్డ్ వాల్లబీ

మిస్సింగ్ కేసులన్నీ ఛేదించాం

పీఎం పాలెం: స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలో ఆగస్టు నెలలో నమోదైన 16 మిస్సింగ్ కేసుల్లోని వ్యక్తులను గుర్తించి, వారి కుటుంబాలకు అప్పగించామని పీఎం పాలెం పోలీస్ స్టేషన్ సీఐ వై.రామకృష్ణ తెలిపారు. అందులో చిటికెల గోవింద (39)అనే వ్యక్తి అదృశ్యం కేసును స్థానిక హెడ్ కానిస్టేబుల్ శ్రీను దర్యాప్తు చేయగా, అతనిపై ఎంవీపీ పోలీస్ స్టేషన్‌లో రూ.4 కోట్లు మోసగించినట్లు కేసు నమోదైనట్లు గుర్తించామన్నారు. దీంతో తదుపరి చర్యల నిమిత్తం ఎంవీపీ పోలీస్ స్టేషన్‌కు అప్పగించామన్నారు. 2016లో అదృశ్యం అయిన వారి కేసు రీ ఓపెన్ చేసి అదృశ్యం అయిన ఇద్దరినీ, 2017లో అదృశ్యం అయిన ఒకరి ఆచూకీ కనుగొని వారి కుటుంబాలకు అప్పగించినట్లు సీఐ తెలియజేశారు



గోవింద్‌తో హెచ్‌సీ శ్రీనివాస్

నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం

దాబాగార్డెన్స్: పాతనగరంలో గల ఆర్య వైశ్య యువజన సంఘం 2024–25 ఏడాదికి నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం ఆదివారం సంఘ భవనం వాసవీ భవన్‌లో నిర్వహించారు. ప్రస్తుత అధ్యక్షుడు నల్లూరి నూకరాజు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో 2024–25 ఏడాదికి గాను అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన దుర్గా సోమేశ్వరరావు, కార్యదర్శి కె. రామారావు, కోశాధికారి పీవీఎస్ ఎన్‌వీ సాంబమూర్తి, మహిళా విభాగం అధ్యక్షురాలు కంకటాల శ్రీలక్ష్మి, ఉపాధ్యక్షులుగా పాలూరి ప్రసాద్, కట్టమూరి ప్రసన్న, సహాయ కార్యదర్శులుగా జి. శ్రీనివాస్, పీఎస్ఆర్ కిషోర్, కట్టమూరి సూర్యనారాయణతో పాటు ఉద్యోగ, వ్యాపార విభాగాలకు సంబంధించి 40 మంది కార్యవర్గ సభ్యులచే ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖ వ్యాపారవేత్త గ్రంధి రాంజీ మాట్లాడుతూ 50 ఏళ్ల కిందట విశాఖలో ఆర్యవైశ్యుల అభ్యున్నతకి, పేద వైశ్యులకు అన్ని విధాల చేయూతనివ్వాలని సంఘాన్ని స్థాపించారన్నారు. నాటి నుంచి ఇప్పటి వరకు అదే స్ఫూర్తితో సేవలందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో విన్నకోట రామమూర్తి, డాక్టర్ పుప్పల భాస్కరరావు, వంకాయల బాబ్జి, కొల్లూరు రాము, పట్నాల వెంకటరెడ్డి, గ్రంధి రామకృష్ణారావు, కందుల మూర్తి తదితరులు పాల్గొన్నారు.

జేసీఐ విశాఖ అచీవర్స్ సెమినార్

దాబాగార్డెన్స్: నగరంలోని ఓ హోటల్‌లో జేసీఐ విశాఖ అచీవర్స్ నేతృత్వంలో ఆదివారం ఓరియంటేషన్ సెమినార్ నిర్వహించారు. విశాఖ జోన్ ప్రెసిడెంట్ సురేష్ గొంప సదస్సును ప్రారంభించి మాట్లాడారు. జేసీఐ విశాఖ చాప్టర్ పరిధిలో పనిచేస్తున్న పలు సంఘాల ప్రతినిధులు సేవలు ఏ విధంగా గుర్తించాలి? అవార్డులు ఎలా ఎంపిక చేయాలనే విషయాన్ని సభ్యులకు తెలియజేశారు. మేనేజ్‌మెంట్ జెడ్ డి.రూప సిరిపూరి మాట్లాడుతూ జూనియర్ చాంబర్ ఇంటర్నేషనల్ ప్రస్తుతం ఎన్నో సేవా కార్యక్రమాలు చేపడుతోందని, వాటిని ప్రజలకు వివరించడంతోపాటు అవార్డులు అందుకునే స్థాయికి ఏ విధంగా తీసుకెళ్లాలనే అంశంపై జేసీఐ అచీవర్స్ ప్రెసిడెంట్ దిలీప్‌కుమార్ నేతృత్వంలో శిక్షణ అందివ్వడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో జేసీఐ వైస్ ప్రెసిడెంట్ అనురాధ్ సిస్టలా, జోనల్ చైర్‌పర్సన్ సింధూర తాడి, ప్రాజెక్ట్ డైరెక్టర్ సోమశేఖర్, బి.దిలీప్‌కుమార్, రంజిత్ షా, డాక్టర్ శీతల్ మదన్, ఉమా, శ్రీదేవి, విజయ కిరణ్, పర్వీన్, చంద్రశేఖర్, ప్రేరణ మదన్ తదితరులు పాల్గొన్నారు.



సెమినార్‌లో పాల్గొన్న వివిధ సంఘాల ప్రతినిధులు

ఖాదర్ బాబాకు గౌరవ డాక్టరేట్



డాక్టరేట్ అందుకుంటున్న ఖాదర్ బాబా

బీచ్‌రోడ్డు: చినవాల్తేరుకు చెందిన సమాజ సేవకుడు, విలేజ్ రెవెన్యూ ఆఫీసర్(వీఆర్వో) ఖాదర్ బాబాకు సన్‌రైజ్ యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్ పురస్కారాన్ని ప్రదానం చేసింది. విశాఖ పబ్లిక్ లైబ్రరీలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో కేజీహెచ్ మాజీ సూపరింటెండెంట్ డాక్టర్ అర్జున, జీవీఎంసీ జోన్-5 కమిషనర్ ఆర్.జి.వి.కృష్ణ చేతుల మీదుగా ఆయనకు గౌరవ డాక్టరేట్‌ను అందజేశారు. పేదలకు అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్నందుకు గాను ఈ అవార్డు పొందినట్లు ఖాదర్ బాబా తెలిపారు.

డిసెంబర్‌లో భీమిలి హైస్కూల్ శతాబ్ది ఉత్సవాలు

భీమునిపట్నం: భీమిలి ప్రభుత్వ ఉన్నత పాఠశాల శతాబ్ది ఉత్సవాలను డిసెంబర్ 14, 15 తేదీల్లో నిర్వహించనున్నట్లు ఉత్సవ నిర్వాహక కమిటీ తెలిపింది. ఆదివారం నిర్వహించిన కమిటీ సభ్యుల సమావేశంలో అధ్యక్ష కార్యదర్శులు గాడు అప్పలనాయుడు, మైలిపల్లి లక్ష్మణరావు మాట్లాడారు. వంద సంవత్సరాల చరిత్ర కలిగిన పాఠశాలలో తామందరం పూర్వ విద్యార్థులు కావడం గర్వంగా ఉందన్నారు. అందుకే కమిటీగా ఏర్పడి శతాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో పైలాన్, సరస్వతీ దేవి విగ్రహాలను ఆవిష్కరించనున్నట్లు తెలిపారు. ఉత్సవాల నిర్వహణకు ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు సహకారాన్ని తీసుకోనున్నామని, కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి లోకేష్‌ను ఆహ్వానిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు ఎం.వి.పార్వతీశం, మైలిపల్లి షణ్ముఖరావు, కాళ్ల సన్నీ, కె.ముత్యాలరావు తదితరులు పాల్గొన్నారు.



సమావేశమైన కమిటీ సభ్యులు

ఉత్సాహంగా కళానైపుణ్య పోటీలు



పాట్ పెయింటింగ్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు,



ఓ విద్యార్థిని తయారు చేసిన కళాకృతి

కొమ్మాది: శ్రీ కృష్ణ జన్మాష్టమిని పురస్కరించుకుని ఇస్కాన్ మందిరంలో ఆదివారం నిర్వహించిన కళానైపుణ్య పోటీలకు విశేష స్పందన లభించింది. నగరం నలుమూలల్లోని అనేక పాఠశాలల నుంచి వందలాది మంది విద్యార్థులు ఉత్సాహంగా పోటీల్లో పాల్గొన్నారు.

కార్యక్రమాన్ని ఇస్కాన్ అధ్యక్షుడు సాంబదాస్ ప్రభూజీ, మాతాజీ నితాయి సేవిని ప్రారంభించారు. వారు మాట్లాడుతూ ఈ నెల 24 నుంచి 27వ తేదీ వరకు ఇస్కాన్‌లో వైభవంగా జన్మాష్టమి వేడుకలు నిర్వహించనున్నామని, ఈ నేపథ్యంలో విద్యార్థుల కోసం అనేక ఆకర్షణీయమైన పోటీలు నిర్వహించామని తెలిపారు. పాట్ పెయింటింగ్, వ్యాసరచన, డ్రాయింగ్, శ్రీకృష్ణ లీలలపై పరీక్ష, భగవద్గీత శ్లోకాల పారాయణం, వంట, పూల అలంకరణ, రంగోలి తదితర పోటీలు నిర్వహించామని, విజేతలకు కృష్ణాష్టమి నాడు బహుమతులు అందజేస్తామని పేర్కొన్నారు.

నేటి తరం నటులకు చిరంజీవి ఆదర్శం



కంచర్లను సత్కరిస్తున్న కళా సంస్థల ప్రతినిధులు

దాబాగార్డెన్స్: నేటి తరం నటులకు చిరంజీవి ఆదర్శప్రాయుడని సినీ నిర్మాత, ఉపకార్ ట్రస్ట్ చైర్మన్ కంచర్ల అచ్యుతరావు పేర్కొన్నారు. అల్లూరి విజ్ఞాన కేంద్రంలో ఆదివారం చిరంజీవి కళా పరిషత్ నేతృత్వంలో నిర్వహించిన చిరంజీవి జన్మదిన వేడుకల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. పద్మ విభూషణ్ డాక్టర్ చిరంజీవి జీవిత చరిత్ర ఆధారంగా మెగా స్టార్ బయోపిక్ నిర్మిస్తానన్నారు. ఉపకార్ ట్రస్ట్ ద్వారా ఎన్నో సేవా కార్యక్రమాలు చేపడుతున్న కంచర్లను 32వ వార్డు కార్పొరేటర్ కందుల నాగరాజు అభినందించారు. అనంతరం కంచర్లను కళా సంస్థల ప్రతినిధులు, ప్రముఖులు సత్కరించారు. గంటి మురళి, కొణతాల రాజు, చెన్నా తిరుమలరావు, ఉపకార్ కన్వీనర్ సుధీర్, కె. లోకేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఇష్టానుసారంగా వాహనాల పార్కింగ్

మద్దిలపాలెం: జీవీఎంసీ 16వ వార్డు ఇసుకతోట ప్రధాన రహదారిపై ఇష్టానుసారంగా వాహనాలు పార్కింగ్ చేస్తున్నారు. ఇదే రోడ్డు మీదుగా రాకపోకలు చేసే వారికి ఇబ్బంది మారింది. ఈ రోడ్డుకు ఇరువైపులా దుకాణాలు వెలిశాయి. వాటికి తోడు తోపుడుబండ్లపై టిఫిన్ దుకాణాలు పెట్టారు. ఈ దుకాణాల వద్దకు వచ్చే వారు వారి వాహనాలను రోడ్డుపై అడ్డదిడ్డంగా నిలిపివేస్తున్నారు. ముఖ్యంగా ఇక్కడి టిఫిన్ షాపు వద్ద ఉదయం వేళల్లో ద్విచక్ర వాహనాలను ఇరువైపులా పార్క్‌చేస్తున్నారు. దీంతో ఈ సమయంలో వాహనాల రాకపోకలకు వీలు లేక ట్రాఫిక్ సమస్య నెలకొంటుంది. ఈ రోడ్డు అటు ఇసుకతోటు జాతీయ రహదారి నుంచి, ఇటు కృష్ణా కళాశాల, హెచ్‌బీ కాలనీ వైపు రాకపోకలు చేసే వాహనాలతో రద్దీగా ఉంటుంది. టూ వీలర్లతో పాటు కార్లు, ఆటోలను సైతం ఈ రోడ్డుపైనే నిలిపివేయడంతో ఉద్యోగులు, విద్యార్థులు కార్యాలయాలు, కళాశాలలకు వెళ్లే సమయంలో ట్రాఫిక్ సమస్య తలెత్తడంతో అసహనానికి గురవుతున్నారు. ట్రాఫిక్ పోలీసులు దృష్టి సారించి ఈ సమస్యను పరిష్కరించాలని, అనధికారికంగా ఏర్పాటు చేసిన దుకాణాలు, తోపుడు బండ్లను తొలగించాలని కాలనీ వాసులు కోరుతున్నారు.



ఇసుకతోట ప్రధాన రహదారిపై నిలిచిపోయిన వాహనాలు

అప్పన్న అన్నప్రసాద పథకానికి విరాళాలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి ఆదివారం సింహాచలం దరి ప్రహ్లాదపురం ప్రాంతానికి చెందిన మహంతి వెంకటలక్ష్మి లక్ష 116 రూపాయాల విరాళాన్ని, దాబాగార్డెన్స్‌కు చెందిన చెక్కరాజు, ప్రసాద్ కలిసి లక్ష 116 రూపాయల విరాళాన్ని అందజేశారు. సంబంధిత విరాళాలను అన్నప్రసాద విభాగం ఏఈవో పాలూరి నరసింగరావుకి, ప్రోటోకాల్ సీనియర్ అసిస్టెంట్ సూర్యనారాయణకు చెక్కుల రూపంలో అందజేశారు. దేవస్థానం తరఫున దాతల కుటుంబాలకు దేవస్థానం అధికారులు దర్శనం కల్పించి ప్రసాదం, శేషవస్త్రం అందజేశారు.



ఏఈవో నరసింగరావుకు చెక్కు అందజేస్తున్న దాతలు

రాంగ్ పార్కింగ్‌పై కొరడా

గోపాలపట్నం: సింహాచలం రైల్వే స్టేషన్‌లో రాంగ్ పార్కింగ్ చేసిన వాహనాలపై ఆర్‌పీఎఫ్ ఎస్‌ఐ కొరడా ఝులిపించారు. సింహాచలం రైల్వే స్టేషన్‌కు వివిధ పనుల నిమిత్తం వచ్చిన వారు, ఇక్కడి పార్కింగ్‌లో కాకుండా బయట వాహనాలు పెట్టి రెండు మూడు గంటల వరకు రాకపోవడం వల్ల ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. స్టేషన్ లోపలికి వెళ్లే దారిలేక వారి పడుతున్న ఇబ్బందులను చూసి ఎస్‌ఐ మమత రాంగ్ పార్కింగ్ వాహనాలకు జరిమానాలు విధించారు. స్టేషన్ పరిధిలో ఎక్కపడితే అక్కడ వాహనాలు నిలపరాదని, తప్పనిసరిగా పార్కింగ్‌లో ఉంచుకోవాలని ఆమె సూచించారు. కానిస్టేబుల్ సోనాలి తదితర సిబ్బంది పాల్గొన్నారు.

సందడిగా సాగరతీరం



కొమ్మాది: సాగర్‌నగర్, రుషికొండ, తొట్లకొండ, భీమిలి బీచ్‌లు ఆదివారం సందర్శకులతో కళకళలాడాయి. సెలవు దినం కావడంతో పాటు ఉదయం నుంచి ఉష్ణతాపం ఎక్కువగా ఉండటంతో ఉపశమనం కోసం సాగరతీరాలకు జనం తరలివెళ్లారు. దీంతో తీర ప్రాంతాల్లో సందడి నెలకొంది.